## ధాత ఉగాది కథల పోటీలో బహుమతి పొందిన కథ

# బ్రతుకు బడి

- యాళ్ళ అచ్యుతరామయ్య

వంటింట్లోంచి పెరట్లోకీ, పెరట్లోంచి వంటింట్లోకీ హడావిడిగా పచార్లు చేస్తోంది అనసూయమ్మ. ఆవిడకి మల్లే బయట సూర్యుడు కూడా మండిపడుతున్నాడు. అప్పుడే గడియారం తొమ్మిది గంటలు కొట్టింది అసహనంగా.

పశువుల పాకనుండి 'అంబా' అన్న అరుపు విని ఆమె మరింత ఆందోళనకు గురైంది. తను వెళ్ళి దూడకట్టు విప్పుదామంటే, అక్కడంతా ఎంతో అపరిశుభ్రంగా ఉంది. అక్కడున్న రెండు ఆవులూ తన భర్త గోదానం పట్టడం వల్ల వచ్చినవే. పశువుల పాకను శుభ్రం చేయడం తప్ప - మిగిలిన పనులన్నీ అనసూయమ్మ ఉదయమే నాలుగ్గంటలకు లేచి, పూర్తి చేసుకుని, ఆరుగంటల కల్లా పూజగదిలో కూర్చుంటుంది.

పెరట్లో పేడకళ్ళు తీసేసి, కళ్ళాపి చల్లడమూ, పిడకలు చేయడమూ, ఆవులను ఊళ్ళోని చెరువుకు తీసుకెళ్ళి శుభ్రంగా కడుక్కుని రావడమూ- ఇవన్నీ రంగీ, దాని మొగుడు వెంకడూ చేస్తారు. 'ఈ రోజున ఇద్దరికీ ఏం మాయరోగమొచ్చిందో, పనికి నాగా పెట్టేశారు' అని అనసూయమ్మ మనసులోనే తిట్టుకుంటూ, పక్కింటివాళ్ళ పనిమనిషి బావిలో నీళ్ళు తోడుతూ కనిపించడంతో, "ఏమే సీతాలూ.. మా రంగికేమయిందే, పనిలోకి రాలేదూ?' అని కేక పెట్టింది.

"అమ్మగోరండీ, రాత్రి రంగి ఎవరితోనో 'తప్పు' సేత్తుండంగా దొరికిపోయిందండి. పొద్దుటేల సీకట్లో ఆ మగమనిసెవరో తెల్వలేదు గానీ, ఆయన్నీ రంగినీ సెట్టుకు కట్టేసేరండి..."

సీతాలు మాటలు విని అనసూయమ్మ నిర్ఘాంతపోయింది. ఇంత కాలంగా ఎంతో నమ్మకంగా పని చేస్తున్న రంగి - ఇంత సిగ్గుమాలిన పని చేసిందంటే ఆమెకెంతో ఆశ్చర్యంగా ఉంది. వాళ్ళ కులంలో అది చాలా సాధారణమే కావచ్చు. ఇంతకుముందో సారి రంగే చెప్పింది - వాళ్ళ కులంలో ఏ ఆడదైనా మరో మగాడితో కలిసి ఉండగా కులపెద్దలు చూసారంటే, వెంటనే వాళ్ళిద్దరినీ చెట్టుకు కట్టేస్తారట! ఆ మగాడికి సంబంధించిన వాళ్ళొచ్చి- కులపెద్దలు నిర్ణయించినంత 'తప్పు' (జరిమానా) కట్టేస్తే ఇద్దరినీ విడిచి పెట్టేస్తారట!! కులపెద్దలతో పాటుగా, దాని భర్త కూడా ఆ జరిమానా డబ్బుతో బాగా త్రాగి, ఆనందిస్తాడట! తర్వాత, ఆ భార్యాభర్తలిద్దరూ అన్యోన్యంగా జీవిస్తారట! ఎంత నీతిమాలిన బ్రతుకు!

హఠాత్తుగా మెదడులో ఓ భయంకరమైన ఆలోచన మెదలడంతో- ఆమె శరీరమంతా గజగజా వణికిపోయింది. కొంపతీసి.. రంగితో తప్పు చేస్తూ దొరికిపోయింది- తన కొడుకు సాయి కాదు కదా!

రాత్రి బడిలో పాఠాలు చెప్పి, రోజూ రాత్రి పదకొండు గంటలకు ఇంటికి చేరే కొడుకు - రాత్రి అసలు ఇంటికి రాకపోడానికి కారణం ఇదేనేమో! సమయానికి భర్త కూడా ఇంట్లో లేడు - ధైర్యం చెప్పడానికి. ప్రక్క ఊరిలో జరుగుతున్న పెళ్ళికీ, సత్యనారాయణ వ్రతానికీ తన భర్తను పురోహితుడిగా రెండురోజుల క్రితమే తీసుకుని వెళ్ళారు. ఆయన తిరిగి ఎప్పుడొచ్చేదీ వివరంగా చెప్పలేదు.

వారం రోజుల క్రిందట జరిగిన ఓ సంఘటన ఆమె కళ్ళ ముందు కదలాడింది...

* * *

పెరట్లోంచి "ఓలమ్మో.. ఓలమ్మో.. సచ్చిపోయినాను తల్లో..." అన్న రంగి అరుపులు వినిపించి, అనసూయమ్మ పూజామందిరం దగ్గర నుండి అటుగా నడిచింది.

వీధి అరుగున కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్న సాయి పరుగు పరుగున వచ్చి, "రంగీ, ఏమైందీ?" అన్నాడు ఆందోళనగా.

"ఎండిన పిడకల్ని గూట్లో సర్దుతుంటే, తేలొచ్చి ఎడంకాలు మడంపైన కుట్టేసిందయ్యా" అంటూ ఏడ్చింది.

వెంటనే సాయి జేబులోని రుమాలు తీసి - విషం పైకి ఎక్కకుండా ఆమె కాలుపై కట్టాడు.

అది చూసి అనసూయమ్మ కంగారుగా, "ఒరేవ్, ఏమిట్రా నీవు చేస్తున్న పనీ! దాని కులమేమిటీ? మన కులమేమిటీ?? వెంటనే నీవు తలస్నానం చేసి, బట్టలు మార్చుకుంటే తప్ప - ఇంట్లోకి రానివ్వను" అని అరిచింది.

ఆమె మాటలు వినిపించుకోకుండా సాయి ఇంట్లోకి పరుగు తీసి, కొంత డబ్బు జేబులో వేసుకుని బయటకు వచ్చి - రంగిని సైకిలుపై కూర్చోబెట్టుకున్నాడు. "అమ్మా.. రంగిని ప్రక్క ఊరిలో ఉన్న డాక్టరుకు చూపించి తీసుకు వస్తాను. విషం ఎక్కువగా శరీరంలోకి వెళ్ళిందంటే, ఒక్కోసారి తేలు వల్ల కూడా చాలా ప్రమాదం జరగవచ్చు" అంటూ సైకిలెక్కాడు.

"నువ్వెందుకురా తీసుకెళ్ళడవూ? దాని మొగుడు వెంకడు మన ఆవులను చెరువుకు తోలుకెళ్ళాడు. వచ్చాకా చూసుకుంటాడులే.. మీ నాన్న వస్తే మంత్రం వేసి ఇట్టే తగ్గించేయరూ!" అంది అనసూయమ్మ.

"ఈ రోజుల్లో మంత్రాలను ఎవరు నమ్ముతారమ్మా?" అంటూ సాయి సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు. అనసూయమ్మ మనసంతా ఆందోళనతో నిండిపోయింది. పల్లెటూరులో - వయసులో ఉన్న ఒక ఆడా మగా సైకిలెక్కి తిరుగుతూ ఉంటే జనం నవ్విపోరూ! అదీ ఓ అంటరాని దానితో!!

అంతవరకూ చదువుల కోసమని పట్నంలో ఉన్న కొడుకు - డిగ్రీ పూర్తి చేసుకుని, ఉద్యోగమేదీ దొరుకుతుందన్న ఆశ లేక, ప్రస్తుతం ఇంటిపట్టునే ఉంటున్నాడు. వచ్చినవాడు ఒక్కడే రాక, అనేక కొత్త కొత్త ఆలోచనలను ఆ ఇంట్లోకి ప్రవేశపెట్టాడు. ప్రతిరోజూ హరిజనవాడలో రాత్రిబడి నడుపుతున్నాడు.

నిత్యం పౌరోహిత్యంలో మునిగి తేలే ఆమె భర్త శర్మకూ, ఆచార వ్యవహారాలంటే ప్రాణమిచ్చే ఆమెకూ- కొడుకు ప్రవర్తన మింగుడు పడడం లేదు. దాంతో ఆమె జీవితంలో పెద్ద కుదుపు ప్రారంభమైంది. అంతవరకూ గడచిన నలభైఏళ్ళ జీవితంలో ఆమె ఎన్నో ఒడిదుడుకులని ఎదుర్కొన్నా - అవన్నీ ఆమె ముందుగా ఊహించినవే! ఇప్పుడలా కాదు - తన జీవితం పూర్తిగా అదుపు తప్పినట్లనిపిస్తోంది.

ఇప్పటివరకూ ఆమె తన ఒంటిపైనే కాక, తన జీవితం పైనే ఒక మడిబట్ట చుట్టుకుంది. వెనకటికి - తనలాంటి ఛాందసురాలే కొబ్బరిచెట్టుకు మడిబట్ట చుట్టిందట - అది చూసి దొంగ ఆ బట్ట ఎక్కడ మైలబడి పోతుందోనని, కొబ్బరికాయలు కోసుకోకుండా పోతాడని ఆమె ఆశ! అదే విధంగా - పట్నంలో పెద్ద చదువు చదివిన ఆమె కొడుకు - తన ఆచారాలను మన్నిస్తాడనుకోవడం తన అమాయకత్వం కాక మరేమిటి?

సాయి సైకిలెక్కించుకుని రంగిని ప్రక్క ఊరు తీసికెళ్ళిన సంగతి భార్య ద్వారా తెలుసుకున్న శర్మ కోపంతో మండిపడ్డాడు. ఉద్యోగం సద్యోగం లేకుండా కొడుకును ఇలానే ఊళ్ళో ఉంచితే, ఎందుకూ పనికి రాకుండా భ్రష్టుడు కావడం ఖాయం అనిపించింది.

ఆ రాత్రి సాయి ఇంటికి రాగానే తండ్రి పిలిచి, "మన ప్రెసిడెంటు సుబ్బారాయుడుగారు తన రైసు మిల్లులో నీకు ఉద్యోగం ఇవ్వడానికి ఒప్పుకున్నారు. రేపు ఉదయమే నీవు పట్నం బయల్దేరి ఆ ఉద్యోగంలో చేరు" అన్నారు శాసిస్తున్నట్లుగా.

"నాన్నా... ఆ సుబ్బారాయుడి మిల్లులో పని చేయడం నాకే మాత్రం ఇష్టం లేదు. నేను న్యాయంగా లెక్కలు రాస్తే, ఆయనా మిల్లును ఒక్కరోజు కూడా నడపలేడు." అన్నాడు సాయి.


"నువ్వొక్కడివే గొప్ప నిజాయితీ పరుడివి బయల్దేరావ్! పోనీ రేపటినుండి నాతో పాటుగా మన కులవృత్తి-పౌరోహిత్యం చేసుకో, ఏం చేస్తాం?" అన్నాడు శర్మ - కోపంగా యజ్ఞోపవీతంతో వీపు గోక్కుంటూ.

"సమాజానికి ఉపయోగపడే పనేం చేయకుండా, ప్రజల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని, జీవించడమేగా మన కులవృత్తి! అదంటే నాకస్సలు గిట్టదు..."

"మరేం గిట్టుతుందీ? అంటరాని వెధవలనందరినీ వెంటేసుకుని తిరగడానికి మాత్రం..."

తండ్రి మాటలకు సాయి అడ్డు వస్తూ, "ఎవరు నాన్నా అంటరాని వాళ్ళూ? వాళ్ళు పండించిన పంటలు మనకు అంటరానివి కానపుడు, వాళ్ళు మాత్రం అంటరానివాళ్ళెలా అవుతారు?" అన్నాడు.

"ఈ ఊకదంపుడు ఉపన్యాసాలు నీ రాత్రిబళ్ళో చెప్పుకోరా! ఇంతకీ ఏం చేసి నువ్వు బ్రతుకుదామనుకుంటున్నావ్?"


Vemakoti Seeta Rama Sastry
WRITER APSEB J/C (Retd)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.

"మన గ్రామంలోని కొంతమంది యువకులం కలిసి బంజరుభూములను సాగు చేసి, శ్రమ పట్లమాకు గల గౌరవాన్ని తెలియజేద్దామనుకుంటున్నాము."

"నీవెలాగైనా చావు కానీ - నేనూ, మీ అమ్మా ఇంత కాలం నుండీ కొన్ని నియమాలతోనూ, నిష్ఠలతోనూ బ్రతుకుతున్నాం. నువ్వు నీ పద్ధతులు మార్చుకోకపోతే, నీకీ ఇంట్లో స్థానం లేదంతే!" అంటూ శర్మ విసురుగా బయటకు నడిచాడు.

అంతవరకూ వంటగదిలో నుండి బిక్కుబిక్కు మంటూ ఈ సంభాషణంతా వింటున్న అనసూయమ్మ బయటకు వచ్చి, కొడుకు వంక దీనంగా చూసి, ఒక్క సారిగా ఏడ్చింది. అది చూసి సాయి తల్లిని దగ్గరకు తీసుకుని ఓదార్చాడు. తనంటే ఎంతో అభిమానం చూపించే కొడుకు, తండ్రితో ఎందుకంత ఘర్షణ పడుతుంటాడో ఆమెకెప్పుడూ అర్థం కాదు...

***


జరిగిన సంఘటనలన్నీ నెమరు వేసుకుంటుంటే, సాయి మీద అనుమానం ఇంకా ఎక్కువవుతోంది. రంగికి పెళ్ళంటే అయింది కానీ, దానికీ, సాయికీ ఒకే వయసు ఉంటుంది. ఆ వయసు వేడిలో వాళ్ళకి మంచీ, చెడూ ఏం తెలుస్తాయి? సాయి పట్నంలో ఉద్యోగం చేయనన్నది - రంగిని వదలి ఉండలేక నేనా?

ఛ... తనెంత నికృష్టంగా ఆలోచిస్తోంది! తమ చాదస్తమంటే వాడికి నచ్చదు కానీ, గొప్ప సంస్కారం కల యువకుడు కాదూ! అప్పుడప్పుడూ వాడు తనకి ఎన్నో గొప్ప విషయాల గురించి చెబుతూ ఉంటాడు. వాడితో మాట్లాడుతున్నంత సేపూ, వాడు చెప్పే

దంతా నిజమేననిపిస్తుంది. కానీ, అవన్నీ ఒప్పుకోడానికి ఆమెకి అహం అడ్డు వస్తుంటుంది. ఇన్నేళ్ళనుండీ తను నమ్ముతూ వస్తున్న ఈ విశ్వాసాలన్నీ ఒఠ్ఠి మూఢ విశ్వాసాలంటే - ఎందుకో ఆ నిజాన్ని భరించడం ఆమెకు కష్టంగా తోస్తుంది.

తను అనవసరంగా సీతాలు నుంచి పూర్తి వివరాలు తెలుసుకో కుండానే, సంభాషణను ముగించి వేసింది. రంగితో పాటు చెట్టుకు కట్టివేయబడ్డ ఆ మగాడు ఎవడో దానినే తెలుసుకుని రమ్మనవలసింది. అలా అడిగితే- తను కూడా ఇలాంటి నీచమైన విషయాల పట్ల ఆసక్తి చూపిస్తున్నట్లు అనుకోదూ అదీ!తనను తనే సమాధాన పరుచుకుంది అనసూయమ్మ.

అంతలో సాయి ఇంట్లోకి రావడం చూసి ఆమె మనసు కుదుటపడింది. కొంత సేపటికి భర్త కూడా ఇంటికి రావడంతో ఆమె ఆలోచనలకు తెరపడింది.



* * *

మరునాడు ఉదయం రంగీ, వెంకడూ మామూలుగానే పనిలోనికి రావడం చూసి అనసూయమ్మకు ఆశ్చర్యమూ, అసహ్యమూ కూడా కలిగాయి. భర్త పూజా మందిరం ముందు కూర్చుని జపం చేసుకుంటున్నాడు. సాయి ఎవరికో ఉత్తరం రాసుకుంటున్నాడు.

అనసూయమ్మ విసురుగా పెరడు వైపుకు వెళ్ళి, "ఒసేవ్ రంగీ, ఏరా వెంకడూ... ఇటు రండి. నేనెంత గడప దాటకుండా ఇంటిలోనే పడి ఉన్నా - నా చెవిన కూడా కొన్ని విషయాలు పడుతున్నాయి. నిన్న అంత జరిగినా, మీరిద్దరూ నంగ నాచుల్లా వచ్చి పని చేసుకు పోవడం చూస్తుంటే - నాకెంతో అసహ్యంగా ఉంది. నిత్యం దేవతార్చన జరిగే ఈ ఇంట్లో- నీతిబాహ్యమైన జీవితాలను వెళ్ళబుచ్చే మీలాంటి వాళ్ళు ఉండడానికి వీల్లేదు. నీతీ నియమాలే ప్రాణంగా భావించే ఆయనకీ విషయం తెలిసిందంటే ఇంకేమైనా ఉందా? వెంటనే ఈ ఇల్లు వదిలి వెళ్ళి పోండి" అని అరిచింది.

ఆ కేకలకు అప్పటికే సాయి అక్కడికి చేరాడు.

"పొరపాటయిపోయింది, ఈ సారికి దయ సూపండమ్మా" అంటూ రంగి ప్రాధేయ పడుతోంది.

వెంకడికి మాత్రం కోపం వచ్చినట్లుంది. సమాధానంగా, "అమ్మగోరూ... తవరిలాంటి గొప్ప కులంలోనయితే - ఆడోల్లు ఇల్లొదిలి బయటికి రానవసరం నేదు. తెల్లారి నేత్తే - ఆడామగా కలిసి నలుగురి ముందూ సేతులు ముడుసుకుని పని సేసుకోవాల్సిన మా కులంలో - మా ఆడోల్లకి కాపు ఏముంటుంది సెప్పండే? మాకు అన్తులూ, అయివేజులూ సొంతానికి ఎలా ఉండవో, మాకు పెల్లాలు కూడా సొంతానికి ఉండరండే" అన్నాడు.

వెంకడి విశ్లేషణ విని సాయి ఆశ్చర్యపోయాడు. పురుషాధిక్య సమాజంలో వెంకడు కూడా భాగం కాబట్టి - స్త్రీని కూడా సొంత ఆస్తిగా భావించినా, వాళ్ళ స్త్రీలు 'శీలవతులు'గా ఉండకపోవడానికి కారణం వాళ్ళు కాదన్న నిజాన్ని నొక్కి చెప్పాడు.

అనసూయమ్మకది ఎదురు సమాధానంగా తోచింది.

"పెళ్ళాం మురొహడితో తిరిగిందన్న సిగ్గు కూడా లేకుండా, తగుదునమ్మా అని ఇంకా కబుర్లు చెబుతున్నావా? మాలాంటి సంస్కారం కలవాళ్ళ ఇళ్ళలో మీలాంటి వాళ్ళు ఒక్క క్షణం కూడా నిలబడ్డానికి అర్హత లేదు" అందామె కోపంతో.

వెంటనే సాయి కలుగజేసుకుంటూ "అమ్మా నీవలా నోరు పారేసుకోకు. నిన్ను చూస్తుంటే జాలి కూడా వేస్తోంది. బయటి ప్రపంచాన్ని అసలు పట్టించుకోకుండా, నీ చుట్టూ నీవే గోడలు కట్టుకుని, నిజాలేవీ తెలుసుకోకుండా మాట్లాడుతున్నావు. నిన్న రంగితో పాటు చెట్టుకు కట్టివేయబడిందెవరో తెలుసా? నాన్నే..."

"ఏమిటీ... మీ నాన్నా!!!" అంటూ అనసూయమ్మ పిచ్చిగా అరిచింది.

"ఈ సంగతి తెలిస్తే నువ్వెక్కడ బాధపడతావోనని, భార్యాభర్తలిద్దరూ ఈ నిజాన్ని బయట పడకుండా దాస్తున్నారు. ఇప్పుడు చెప్పమ్మా - వాళ్ళకున్న పాటి సంస్కారం మనలో ఎవరికుంది?" అన్నాడు సాయి ఆవేశంగా.

ఒక్కసారిగా అనసూయమ్మ కాళ్ళ క్రింద నేల అదిరింది. ఇది నిజమా? తన భర్త - ప్రెసిడెంటు సుబ్బారాయుడితో కలిసి ఊరికి కొంత అన్యాయం చేస్తున్న సంగతి గ్రహించినా, ఇంత గుణహీనుడను కోలేదు. తండ్రి గురించి ఇలాంటి నిజాలేవో సాయికి ఇంతకు ముందు కూడా తెలిసుంటాయి. అందుకే వాడికి తండ్రంటే గౌరవం లేకుండా పోయింది. తన ముఖాన్ని రంగికి చూపించలేక ఆమె ఇంట్లోకి వెళ్ళి పోయింది.

* * * * *

హరిజన పేటలో రాత్రి బడి నిర్వహిస్తున్న సాయి తన తల్లి అటు రావడం చూసి ఆశ్చర్యపోయాడు. తన ఆచార వ్యవహారాలన్నింటినీ వదిలి, మొదటిసారిగా హరిజన పేటలోకి అడుగు పెట్టిన అనసూయమ్మను చూసి - రంగీ, వెంకడే కాక, మిగిలిన వాళ్ళందరూ కూడా ఆశ్చర్యం తోనూ, ఆనందంతోనూ నోళ్ళు తెరిచారు.

"బాబూ సాయీ... ఈ రోజు నుండీ నేనూ మీ రాత్రి బడికి వస్తాను" అంది అనసూయమ్మ రంగి ప్రక్కనే కూర్చుం టూ.

"నీకెందుకమ్మా ఈ రాత్రి బడీ? చదవడమూ, రాయడమూ రానివాళ్ళ కోసం మీ బడి" అన్నాడు సాయి.

"నేనింతవరకూ భర్త గ్రంథాలు మాత్రమే చదువుకుంటూ, లోకం గురించి పట్టించుకోకుండా, గుడ్డిదాన్నయి పోయాను. ఇప్పుడు మీ అందరితో కలిసి, ఈ బ్రతుకుబడిలో అసలైన చదువు నేర్చుకోవాలనుకుంటున్నాను" అందామె. ❑